## ఐకమత్యంతో జాతర జరుపుకోవాలి

• మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి



ఎడ్ల పందేలను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

చింతలపాలెం, ఏప్రిల్ 19 : గ్రామాల్లో ఐకమత్యంతో ప్రజలందరూ జాతర వేడుకలు జరుపుకోవాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నక్కగూడెం గ్రామంలో కొనసాగుతున్న సీతారామచంద్ర స్వామి కల్యాణ మహోత్సవ వేడుకలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన బండ లాగుడు పోటీలను ఆయన ప్రారంభించారు. స్వామి వారి దీవెనలు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని, అందరూ పాడి పంటలతో, సుఖ శాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎంపీపీ వెంకట్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రావు, సత్యనారాయణరెడ్డి, రవీంద్రనాయక్, నగేశ్ పాల్గొన్నారు.

## 22న భువనగిరి గురుకులానికి జాతీయ ఎస్సీ కమిషన్

యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ) : భువనగిరి జిల్లా కేంద్రంలోని ఎస్సీ గురుకుల పాఠశాలలో ఇటీవల జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనను జాతీయ ఎస్సీ కమిషన్ సీరియస్‌గా తీసుకున్నది. ఈ నెల 22న గురుకుల పాఠశాలను కమిషన్ బృందం సందర్శించనున్నది. బృందం సభ్యులు పాఠశాలలో పరిస్థితులను పరిశీలించడంతో పాటు విద్యార్థులతో మాట్లాడనున్నారు. ఈ నెల 12న భువనగిరి సోషల్ వెల్ఫేర్ గురుకులంలో కలుషిత ఆహారం తీసుకుని 28 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఆరో తరగతి విద్యార్థి ప్రశాంత్ పరిస్థితి విషమించి ఈ నెల 16న మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జాతీయ ఎస్సీ కమిషన్ బృందం గురుకుల పాఠశాలలో పరిస్థితులను పరిశీలించి, కేంద్రానికి నివేదిక అందించనుంది.

## కోదండ రామాలయ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక పూజలో పాల్గొన్న భక్తులు

నేరెడుచర్ల, ఏప్రిల్ 19 : నేరేడుచర్ల పట్టణంలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో మూడు రోజుల పాటు కొనసాగే ప్రతిష్ఠాపన మహోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేద పండితులు ఉప్పల ఫణీంద్ర శర్మ, పట్టణ పురోహితుడు నెమ్మాని వెంకటరమణమూర్తి బృందం ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, రుత్వికా వరణం, దీక్షాధారణ, గోపూజ, నవగ్రహ ఆవాహన, మంత్ర పుష్ప తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం సమయంలో మేళ తాళాల నడుమ సాంప్రదాయబద్ధంగా దేవతామూర్తుల విగ్రహాలకు జలాధివాసం క్రతువు పూర్తి చేశారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

### శ్రీరామ నామ లిఖిత అక్షింతలు అందజేత

కోదండ రామాలయ ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా ఈ నెల 21న నిర్వహించే శాంతి కల్యాణ మహోత్సవానికి శ్రీరామ లిఖిత అక్షింతలను శుక్రవారం ఆలయ కమిటీకి అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీరామ భక్తురాలు చలువాది మల్లివిష్ణు వందన భగవంతుడిపై మక్కువతో సూక్ష్మ కళతో బియ్యపు గింజలపై శ్రీరామ నామాలను లిఖించారు. వాటిని స్థానిక వ్యాపారి పాల్వాయి రమేశ్ దంపతుల ద్వారా ఆలయ కమిటీకి అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

## బీజేపీ ఓటమే కార్మికుల లక్ష్యం

• సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు

నేరేడుచర్ల, ఏప్రిల్ 19 : లోక్‌సభ ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా బీజేపీని ఓడించడానికి కార్మిక వర్గమంతా కంకణబద్ధులు కావాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, తెలంగాణ వ్యావసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 29 కార్మిక చట్టాల పునరుద్ధరణకై జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ ఓటమే లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు. అలాగే మే 1న సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో నిర్వహించే మే డే వేడుకలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి, యల్లబోయిన సింహాద్రి, రావుల సత్యం, లక్ష్మి పాల్గొన్నారు.

## మునగాలలో 44.3 డిగ్రీల ఎండ

మునగాల, ఏప్రిల్ 19 : వేసవి ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. రాష్ట్రంలోనే ఉమ్మడి జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శుక్రవారం మునగాల మండలంలో అత్యధికంగా 44.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పలువురు యువకులు మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై కోడిగుడ్డు కొట్టి ఆమ్లేట్ వేశారు.

## హత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

సూర్యాపేట లీగల్, ఏప్రిల్ 19 : హత్య కేసులో దోషిగా తేలిన వ్యక్తికి న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. కేసు వివరాలు.. మోతె మండలం నామవరం గ్రామానికి చెందిన ఆకారపు ముత్తమ్మ (80) ఎద్దులు కొనేందుకు రూ.30 వేలు అప్పు చేసి ఇంట్లో దాచింది. ఇది గమనించిన అదే గ్రామానికి చెందిన దైదా మహేందర్ డబ్బులు ఇవ్వమంటూ ముత్తమ్మను వేధించేవాడు. 2 ఆగస్టు 2018న ఆమె ఇంట్లోకి ప్రవేశించి డబ్బులు అడుగగా ఇవ్వకపోవడంతో గొంతు నులిమి చంపి రూ.12,600 అపహరించాడు. ఆ సమయంలో వృద్ధురాలి కూతురు జానమ్మ రాగా నిందితుడు ఆమెను చూసి పారిపోయాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ శివశంకర్ అభియోగ పత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో మహేందర్‌కు హత్య చేసినందుకు జీవిత ఖైదు, రూ.5 వేల జరిమాన, దొంగతనం కేసులో

ఏడాది జైలు, రూ.500 జరిమాన విధిస్తూ సూర్యాపేట ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ శుక్రవారం తీర్పు వెలువరించారు.

## ఎన్నికల వ్యయ పరిశీలన పకడ్బందీగా ఉండాలి

• భువనగిరి పార్లమెంట్ వ్యయ పరిశీలకుడు సాయన్ దే బర్మ



ఎన్నికల వ్యయ ఖర్చులపై సమీక్షిస్తున్న భువనగిరి పార్లమెంట్ వ్యయ పరిశీలకుడు సాయన్ దే బర్మ

సూర్యాపేట, ఏప్రిల్ 19 : ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో వ్యయ పరిశీలన పకడ్బందీగా ఉండాలని భువనగిరి పార్లమెంట్ వ్యయ పరిశీలకుడు సాయన్ దే బర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో భువనగిరి పార్లమెంట్ పరిధిలోని నకిరేకల్, తుంగతుర్తి నియోజకవర్గాల పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటీ, జీఎస్‌టీ సహాయ వ్యయ పరిశీలకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ ఎస్.వెంకట్రావ్, ఎస్పీ రాహుల్ హెగ్డేతో కలిసి సమీక్షించారు. ఈ సంరద్భంగా ఆయన మాట్లాడూతూ.. ఎన్నికల అకౌంటింగ్ విధానం, సీజర్, జీఎస్టీ, ఎక్సైజ్ కేసులు ఎక్కువగా నమోదు చేయాలన్నారు. సరిహద్దు చెక్‌పోస్టుల్లో నియమించిన బృందాలు నిరంతరం నిఘా ఉంచి ప్రతి వాహనంను తనిఖీ చేయాలని సూచించారు. పెయిడ్ ఐటమ్స్‌కి రేట్ కార్డు ప్రకారం ఖర్చు వ్యయాన్ని అభ్యర్థి ఖాతాలో జమ చేయాలన్నారు. ప్రకటనలకు ముందస్తు అనుమతులు తీసుకోవాలని లేకపోతే ఖర్చు వ్యయాన్ని జమ చేయాలని సూచించారు. కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ మాట్లాడుతూ.. సూర్యాపేట జిల్లాలోని తుంగతుర్తి నియోజకవర్గం పరిధిలో 6 మండలాలు భువనగిరి పార్లమెంట్ పరిధిలో ఉన్నట్లు తెలిపారు. ఈ పరిధిలో 213 పోలింగ్ కేంద్రాలు 2,59,096 మంది ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. సుమారు 31 సమస్యాత్మక ప్రాంతాల్లో 39 పోలింగ్ కేంద్రాలు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. సర్వీస్ ఓటర్లు 139, ఎన్ఆర్ఐ ఓటర్లు 8, దివ్యాంగులు 3,797 మంది ఓటర్లు ఉన్నట్లు వివరించారు. ఎస్పీ రాహుల్ హెగ్డే మాట్లాడుతూ.. తుంగతుర్తి నియోజకవర్గం పరిధిలో 3 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 22 రూట్స్‌గా విభజించి గట్టి నిఘా పెంచామన్నారు. ఇప్పటి వరకు రూ.25 లక్షల నగదు, రూ.31 లక్షల విలువ గల 663 లీటర్ల మద్యాన్ని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, సోషల్ మీడియా ట్రాకింగ్ సెంటర్‌తో పాటు ఇతర విభాగాలను సాయన్ దే బర్మ పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రియాంక, బీఎస్.లత, నకిరేకల్ ఏఆర్‌ఓ పూర్ణచందర్‌రావు, అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావుతో పాటు అధికారులు పాల్గొన్నారు.

### అమ్మ ఆదర్శ పాఠశాల పనులు జూన్ వరకు పూర్తి చేయాలి : కలెక్టర్

తిరుమలగిరి : అమ్మ ఆదర్శ పాఠశాల కింద మంజూరైన పనులను జూన్ వరకు పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీలోని నెల్లిబండ 321 పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. సాధ్యమైనంత తక్కువ ఖర్చుతో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో పనులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. పాఠశాలలో తాగునీరు, టాయిలెట్స్, విద్యుత్ వంటి మౌలిక వసతులు, చిన్న చిన్న మరమ్మతులను చేపట్టి పూర్తి చేయాలని పాఠశాల హెచ్ఎం, ఇంజినీరింగ్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. తిరుమలగిరి మండలంలో 25 పనులు మంజూరు కాగా 17 పనులు గ్రౌండ్ చేశారని మిగతా పనులు కూడా త్వరగా గ్రౌండింగ్ చేయాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని ఆదర్శ పాఠశాలల్లో విద్యుత్ బిల్లుల కోసం నిధులు మంజూరు చేయడం జరిగిందని, హెచ్ఎంలు వెంటనే బిల్లులు చెల్లింపు చేసి నిరంతరంగా విద్యుత్ ఉండేలా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాందుర్గారెడ్డి, ఎంపీడీఓ లాజర్, ఎంఈఓ శాంతయ్య, ఏఈ రంగారావు పాల్గొన్నారు.

## చెరువు నుంచి అక్రమంగా మట్టి తోలకం

ఆత్మకూర్.ఎస్, ఏప్రిల్ 19 : మండల పరిధిలోని ముక్కుడుదేవులపల్లి గ్రామం పిల్లబోయినకుంటలో చెరువు నుంచి అక్రమంగా మట్టి తరలింపు యదేచ్ఛగా కొనసాగుతున్నది. జేసీబీతో మట్టిని తవ్వి ట్రాక్టర్లతో ఇటుక బట్టీలకు, ఇతరులకు అమ్ముకుంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పది రోజుల్లో చెరువులోని మట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తున్నారని మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులకు సమాచారం ఉన్నా చర్యలు లేకపోవడంతో యదేచ్ఛగా మట్టి తోలకం సాగుతున్నట్లు తెలిపారు. శుక్రవారం సైతం చెరువులో సుమారు పది ట్రాక్టర్లు, జేసీబీతో మట్టి తరలిస్తుండగా స్థానికులు అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వ చ్చే లోగా వాహనాలతో సహ అక్కడి నుంచి పరారయ్యారు. ముక్కుడుదేవులపల్లి స్టేజీ వద్ద ఉన్న ఇటుక బట్టి వద్ద చెరువు మట్టి భారీగా ఉన్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. వెంటనే అధికారులు మట్టి తోలకంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ఫణిగిరి గుహలో పార్వతి దేవి శిల్పం



గుహలోని పార్వతి దేవీ శిల్పాన్ని చూపుతున్న చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి

నాగారం, ఏప్రిల్ 19 : ప్రపంచంలో ఎక్కడ లేని బౌద్ధ శిల్ప సంపద ఫణిగిరిలో దాగి ఉన్నదని చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఫణిగిరి గ్రామ గుట్టపై పురావస్తు శాఖ జరుపుతున్న తవ్వకాలను ఆయన సందర్శించారు. ఈ క్రమంలో గుట్ట ఎక్కే ముందు ఒక చిన్న గుహలో పార్వతి దేవి శిల్పాన్ని ఆయన గుర్తించారు. ఈ గుహ సుమారుగా 6 ఫీట్ల పొడవు, వెడల్పుతో నాలుగు ఫీట్ల ఎత్తు ఉన్నట్లు ఆయన తెలిపారు. గుహలో ఒక దీర్ఘ చతురస్రాకారంలో రెండు ఇంచుల లోతు తొలిచిన పానమట్టం మధ్యలో ఉబ్బెత్తుగా రెండు శివ లింగాలను తొలిచినట్లుగా ఇలా ఐదు జంట శివ లింగాలు ఉన్నట్లు చెప్పారు.

గుహ లోపల వెనుక భాగం వైపు ఆసీనురాలైన నాలుగు ఇంచుల ఎత్తైన దేవతా శిల్పం చెక్కి ఉన్నట్లు బహుశా పార్వతి దేవి అయి ఉండవచ్చని తెలిపారు. గుహ పక్క నుంచి తొలిచిన చిన్న దిగుల్ల సహాయంతో వెలితే మరొక ఆసక్తికరమైన శిల్పం ఉన్నట్లు దాన్ని పూర్తిగా చెక్కకుండా వదిలేసినట్లు, బహుశా అది భైరవ శిల్పమై ఉంటుందని పేర్కొన్నారు.

## క్యామ మల్లేశ్ ప్రచారానికి తరలిన బీఆర్ఎస్ నాయకులు




నాగారం నుంచి తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

నాగారం ఏప్రిల్ 19 : బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌యాదవ్ శుక్రవారం జాజిరెడ్డిగూడెం మండలంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి మండలం నుంచి పార్టీ మండలాధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో ఎంపీపీ కూరం మణీవెంకన్న, గుండగాని అంబయ్యగౌడ్, చిల్లర చంద్రమౌళి, దోమల బాలమల్లు, ఈదుల కిరణ్‌కుమార్, ప్రశాంత్, సత్తయ్య, సైదులు, వెంకన్న, శ్రీనివాస్, వీరన్న, లింగయ్య ఉన్నారు.

## హమాలీ కూలీ రేట్లు పెంచాలి

• బీఆర్ఎస్‌కేవీ నియోజకవర్గ అధ్యక్షుడు ఉపేందర్



వర్తకసంఘం అధ్యక్షుడికి నోటీసులు అందజేస్తున్న బీఆర్ఎస్ కార్మిక నాయకుడు ఉపేందర్

హుజూర్‌నగర్, ఏప్రిల్ 19 : పెరుగుతున్న నిత్యవసరాల ధరలకు అనుగుణంగా హామాలీల కూలీ రేట్లు పెంచాలని బీఆర్ఎస్‌కేవీ నియోజకవర్గ అధ్యక్షుడు పచ్చిపాల ఉపేందర్ అన్నారు. శుక్రవారం కూలీల రేట్లు పెంపును కోరుతూ వర్తక సంఘం అధ్యక్షుడు ఉప్పల రమేశ్‌కు నోటీసును అందజేశారు. కార్యక్రమంలో కార్మికులు వెంకన్న, రామన్న, కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

## కంచర్ల గెలుపునకు కృషి చేయాలి

• బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బసవయ్య

మేళ్లచెర్వు, ఏప్రిల్ 19 : బీఆర్ఎస్ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ మండలాధ్యక్షుడు సూరిశెట్టి బసవయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని రామాపురం గ్రామంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో జరిగిన అభివృద్ధి, అందిన సంక్షేమాన్ని గడప గడపకూ వివరిస్తూ ప్రచారం చేయాలన్నారు. ఆయన వెంట పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కొట్టె నరసింహారావు ఉన్నారు.

## గృహజ్యోతి అర్హుల నుంచి బిల్లుల వసూలు సరికాదు

• బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు

గరిడేపల్లి, ఏప్రిల్ 19 : గృహజ్యోతి పథకానికి అర్హులైన వారి నుంచి ప్రభుత్వం విద్యుత్ బిల్లులను వసూలు చేయడం సరికాదని బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు మండవ నాగేశ్వర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. అర్హులైన అందరికీ విద్యుత్ బిల్లులను రద్దు చేస్తామని చెప్పిన ప్రభుత్వం కొందరికి మాత్రమే జీరో బిల్లులను ఇస్తూ చాలా మంది నుంచి బిల్లులను వసూలు చేసి మోసం చేస్తుందన్నారు. ఇచ్చిన ఏ మాటను సక్రమంగా నిలబెట్టుకోని కాంగ్రెస్ ప్రభుత్వానికి త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. అలాగే బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పేర్కొన్నారు.

## బాల్య వివాహాలను నిర్మూలించాలి

• ఎంవీఎఫ్ మండల ఇన్‌చార్జి రవి

నూతనకల్, ఏప్రిల్ 19 : గ్రామీణ ప్రాంతాల్లో నేటికి కొనసాగుతున్న బాల్య వివాహాలను నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంవీఎఫ్ మండల ఇన్‌చార్జి చిప్పలపల్లి రవి అన్నారు. శుక్రవారం మండలంలోని మాచనపల్లి గ్రామంలో ఎంవీఎఫ్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. బాలికలకు 18 ఏండ్లు, బాలురకు 21 ఏండ్లు వచ్చే వరకు వివాహం చేయకూడదన్నారు. కార్యక్రమంలో విజయ, ధనమ్మ పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పని దినాలు పెంచాలి

• సీపీఐ మండల కార్యదర్శి ప్రభాకర్‌గౌడ్

నూతనకల్, ఏప్రిల్ 19 : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పని దినాలను 100 నుంచి 200 రోజులకు పెంచాలని, కూలీలకు బీమా సౌకర్యం కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి తోట్ల ప్రభాకర్‌గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ఎన్ఎంఎంఎస్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో వసతులు కల్పించాలని, రెండు సార్లు ఫొటోలు అప్‌లోడ్ చేసే నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ రద్దు చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు వీరమల్లు, రమణయ్య, సుధాకర్, నర్సింహులు, అవిలయ్య, చంద్రమౌళి పాల్గొన్నారు.

## రైతుల ఖాతాలో వెంటనే డబ్బులు పడేలా చర్యలు

• డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు



డీఆర్‌డీఓ : నాగారం : వర్ధమానుకోటలోని పాటిమీదిగూడెం పీపీసీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మధుసూదన్‌రాజు

నాగారం, ఏప్రిల్ 19 : ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ట్యాబ్ ఎంట్రీ చేసి రైతులకు డబ్బులు పడేలా చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని వర్ధమానుకోట ఆవాసం పాటిమీదిగూడెం సెంటర్‌ను పరిశీలించి మాట్లాడారు. అలాగే పసునూరు, నాగారం బంగ్లా, నాగారం సెంటర్లను మండల ప్రత్యేక అధికారి, డీఈఓ అశోక్ పరిశీలించి రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. మండలంలోని డి.కొత్తపల్లి గ్రామంలో శివగంగ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ వారి పీపీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గ్రామ మాజీ సర్పంచ్ బెల్లి సైదులు ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ బెల్లి పద్మ, ఏఓ పెండెం గణేశ్, ఏపీఎం తరాల శోభారాణి, ఏఈఓ సాయిరాజ్, వీబీకేలు పాల్గొన్నారు.

### కాంటాల్లో తేడాలు ఉండొద్దు

మద్దిరాల : ధాన్యం కాంటాలు వేసేటప్పుడు కాంటాల్లో హెచ్చు తగ్గులు లేకుండా చూసుకోవాలని తాసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. మండలంలోని రామచంద్రాపురం గ్రామంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రతీ రైతు తమ వడ్లను తూర్పార పట్టుకున్నాకనే తేమ శాతం చూసి కాంటాలు వేయాలని చెప్పారు. రైతులు కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు సహకరించి త్వరగా కాంటాలు జరిగేట్టు పరస్పరం సహకరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం మైసయ్య పాల్గొన్నారు.



మద్దిరాల : రామచంద్రాపురం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న తాసీల్దార్ అమీన్‌సింగ్

## మంచినీటి సమస్యను పరిష్కరించాలి

• సూర్యాపేట మున్సిపల్ కమిషనర్‌కు పీఓడబ్ల్యూ నాయకుల వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీఓడబ్ల్యూ నాయకులు

బొడ్రాయిబజార్, ఏప్రిల్ 19 : సూర్యాపేట పట్టణ పరిధిలోని రెండో వార్డు సాయి గుట్ట వద్ద సుమారు 40 కుటుంబాలు మంచి నీరు లేక ఇబ్బందులు పడుతున్నారని పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక అన్నారు. జిల్లా కేంద్రంలోని 2వ వార్డులో నెలకొన్న మంచినీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్‌కు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ విషయమై రెండు నెలల క్రితం సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసినప్పటికీ నేటికి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ స్పందించి నీటి సౌకర్యం కల్పించాలని లేనిపక్షంలో పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ, ఉపాధ్యక్షురాలు సూరం రేణుక, పద్మ, రమణ పాల్గొన్నారు.

## విద్యా వ్యవస్థ బలోపేతానికి కృషి చేయాలి

• ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడు వెంకట్



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడు వెంకట్

నేరేడుచర్ల, ఏప్రిల్ 19 : విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం కృషి చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడు కొమ్రాజు వెంకట్ అన్నారు. శుక్రవారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రభుత్వ రెసిడెన్షియల్ కాలేజీలు, స్కూల్స్‌లో కలుషిత ఆహారంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని, మరి కొంత మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. అందుకు ముఖ్య కారణం విద్యాశాఖ మంత్రి లేకపోవడమే అన్నారు. సమావేశంలో నాయకులు రెడ్డిపల్లి వినయ్, దాచేపల్లి నరేశ్, రాకేశ్ పాల్గొన్నారు.

## క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

• డాక్టర్ సుధాకర్‌నాయక్



వైద్య పరీక్షలు చేసి అవగాహన కల్పిస్తున్న మండల వైద్యాధికారి సుధాకర్‌నాయక్

మఠంపల్లి, ఏప్రిల్ 19 : క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ సుధాకర్‌నాయక్ అన్నారు. జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండలంలోని చౌటపల్లి గ్రామంలో యాక్టివ్ కేస్ ఫైండింగ్ ఫర్ టీబీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీబీతో బాధపడుతున్న వారి దగ్గరకు వెళ్లి పరీక్షించారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నిషియన్ రమేశ్, వైద్య సిబ్బంది నిర్మల, సైదమ్మ, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, భాస్కర్, ఆశ వర్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

## బావిలో పడి పశువుల కాపరి మృతి

కోదాడ రూరల్, ఏప్రిల్ 19 : ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి పశువుల కాపరి మృతి చెందాడు. ఈ ఘటన పట్టణ పరిధి కొమరబండ శివారులో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొమరబండకు చెందిన పశువుల కాపారి దాసరి వెంకన్న (48) దాహం వేయడంతో బావిలోకి దిగాడు. ప్రమాదవశాత్తు కాలుజారడంతో నీటిలో పడి మునిగి చనిపోయినట్లు తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గరిడేపల్లి, ఏప్రిల్ 19 : 33/11 కేవీ గరిడేపల్లి సబ్ స్టేషన్ పరిధి పొనుగోడు ఫీడర్ లైన్ల కింద గల చెట్ల కొమ్మలను తొలగించడం కోసం శనివారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ రావిరాల నగేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే కీతవారిగూడెం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని కీతవారిగూడెం ఫీడర్ లైన్ల కింద సైతం చెట్ల కొమ్మలను తొలగించనున్నందున ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. కావున ఆయా ఫీడర్ పరిధిలోని వినియోగదారులు సహకరించాలని కోరారు.